## చిన్నకథ

# ఔదార్యం

‘‘ఎలా ఉంది?’’

కూతురు సునయనను డాబా మీదకు తీసుకు వచ్చి కుతూహలాన్ని ఆపుకోలేక గబగబా చిన్నగా అడిగింది తల్లి రేణుక.

‘‘బావుంది’’ చెప్పింది సునయన.

‘‘నాకంటే అందంగా వుందా?’’ మళ్లీ అడిగింది రేణుక.

సునయన జవాబు చెప్పలేదు. తల్లిని చూస్తూ నిలబడింది పిట్టగోడను ఆనుకుని.

‘‘మాట్లాడవేం?’’

‘‘నీకు కోపం వస్తుందేమో’’ అన్నది సునయన.

‘‘రాదులే చెప్పు..’’ నవ్వుతూ అన్నది రేణుక.

తల్లి నవ్వడంతో ధైర్యం తెచ్చుకుని చెప్పింది సునయన ‘‘అవును. నీకంటే చాలా అందంగా వుంది. వాళ్ల ఇల్లు కూడా చాలా బాగుంది. ఆమెకో కూతురు. ఇంటర్‌లో చేర్పించాలట. నాకు రెండు జాంగ్రీలు పెట్టింది. నాన్నగారికి షుగర్ వుందని తెలుసేమో! పెట్టలేదు. పకోడీలు పెట్టింది. తర్వాత కాఫీ ఇచ్చింది. తాగిన తర్వాత నాన్నగారు నన్ను ఇంటికి వెళ్లమన్నారు. వచ్చాను. వాళ్లు మాట్లాడుకుంటున్నారు. నేను తిరిగి వచ్చేటప్పుడు అప్పుడప్పుడు వాళ్ల ఇంటికి వస్తూ వుండమని చెప్పింది బయట దాకా వచ్చి’’ వివరంగా చెప్పింది సునయన.

‘‘ఇంతకీ ఆమె పేరేమిటి? తెలుసా?’’

‘‘పూర్తి పేరేమిటో తెలీదు. నాన్నగారు మాత్రం రెండు సార్ల శశీ అని పిలిచారు’’

‘‘శశకళో, శశిరేఖో అయి వుంటుంది. ఐతే మీ నాన్నగారు సామాన్యులు కారు’’ నవ్వుతూ అన్నది రేణుక.

తల్లి వైపు ఆశ్చర్యంగా చూసింది సునయన. తల్లి ఎలా నవ్వగలుగుతున్నదో సునయనకు అర్థం కాలేదు. తండ్రిని కోపంతో తిడుతుందని అనుకున్నది.

‘‘సర్లే ... ఈవిషయం గురించి ఇంకెక్కడా అనకు. చివరకు మీ అన్నయ్యతో కూడా ’’ చెప్పింది రేణుక.

సునయన తల వూపింది. తర్వాత ఇద్దరూ కిందికి వెళ్లారు. సునయన టెన్త్ క్లాసు చదువుతోంది. ఆ అమ్మాయి తండ్రి దివాకరంతో కలిసి బజారుకు వెళ్లింది ఏవో ఫేన్సీ సామాన్లు తీసుకు రావటానికి. కొంత సేపటి తర్వాత ఒంటరిగా ఇంటికి వచ్చింది. షాపులో కలిసిన ఒక అందమైన ఆమె తండ్రిని, తనని వాళ్ల ఇంటికి తీసుకెళ్లిందని అదోలా చెప్పింది సునయన. అప్పుడు తల్లి రేణుక కూతుర్ని డాబా మీదకు తీసుకెళ్లి ఆమె గురించిన వివరాలు సేకరించింది.

ఇంటికి వచ్చిన భర్త దివాకరాన్ని రేణుక ఏమీ అడగలేదు. రాత్రి పడుకున్న తర్వాత అవకాశం దొరికింది అడగటానికి.

‘‘ఇంతకీ ఎవరామె?’’ అడిగింది.

‘‘సునయన చెప్పిందా?’’

‘‘అవును’’

‘‘మా సెక్షన్ ఆఫీసర్ ఈ మధ్య పోయాడని చెప్పాను కదా. ఆయన భార్య శశికళ’’

‘‘ఏమిటి విషయం?’’ నవ్వుతూ అడిగింది.

‘‘స్పష్టంగా అడుగు రేణూ.. మనమధ్య దాపరికాలు లేవు’’ అన్నాడు దివాకరం.

ఆ విషయం నిజమే. దివాకరం ఎలాంటివాడో తనకు బాగా తెలుసు. తనని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. ఇప్పటికీ తనని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. తన వైవాహిక జీవితంలో తనకు ఎలాంటి లోటూ లేదు. దివాకరానికి తనకు తెలిసి పరాయి ఆడవాళ్ల మీద కొంచెం కూడా ఆసక్తి లేదు. తనకు స్పష్టంగా తెలుసు.

‘‘ఏమిటి రేణూ ఆలోచిస్తున్నావ్?’’

‘‘మీ గురించే .. ఆశశికళగారు మిమ్మల్ని తన ఇంటికి ఎందుకు తీసుకు వెళ్లింది?’’ అంది.

దివాకరం ఇలా చెప్ప సాగాడు..

‘‘మీ సెక్షన్ ఆఫీసర్ పరమశివం మన పక్క కాలనీలో ఉండేవాడు. ఆయనభార్య శశికళ. వాళ్లకు ఒక



కూతురు వుంది. టెన్త్ క్లాసు పాసయ్యింది. ఇంటర్‌లో చేర్పించాలి. ఆయన హఠాత్తుగా హార్ట్ అటాక్‌తో చనిపోయాడు. ఆయన నాతో బాగా స్నేహంగా వుండేవాడు. ఆయన నా గురించి భార్యతో ఏం చెప్పాడో తెలీదు. ఆమె ఆఫీసుకు వచ్చి నన్ను కలుసుకుని తన భర్త తాలూకు రావలసిన బెనిఫిట్స్ గురించి అడిగింది. అవి త్వరగా వచ్చేలా చెయ్యమని రిక్వెస్ట్ చేసింది. ఆయన పోయినందున ఆయన స్థానంలో నన్ను ప్రమోట్ చేశారు. ఇంతకు ముందు ఆయన కోసం వాళ్ల ఇంటికి కొన్నిసార్లు వెళ్లాను. అందువల్ల నాతో ఆమెకు పరిచయం వుంది. హఠాత్తుగా భర్త పోవడంతో ఒంటరితనం ఫీలవుతోంది. ఆమె ఫీలింగ్స్ పంచుకోవడానికి ఓ తోడు కావాలి. అది కేవలం మానసికం మాత్రమే. నా గురించి నీకు తెలుసు. ఆమె గురించి నాకు తెలుసు. నామీద ఆమెకు కేవలం అభిమానం మాత్రమే వుంది. నాకు ఆమె మీద మంచి మిత్రుడి భార్య అనే సానుభూతి వుంది. ఓ మగవాడిగా తన కుటుంబ అవసరాల్లో సాయం చేయమని ఆమె కోరింది. సరే అన్నాను. ఇంతకు మించి మా మధ్య ఏమీ లేదు.’’

రేణుక సాలోచనగా తలూపింది.

‘‘ఇంకో విషయం.. నిన్న సాయంత్రం ఆమె నాకో విషయం చెప్పింది. వాళ్లమ్మాయి విశాలను రేపు కాలేజీలో చేర్పిస్తుందిట. అందుకు డొనేషన్ ప్లస్ ఫీజు పాతిక వేలట. ప్రస్తుతం తనకు ఇంకో ఐదువేల రూపాయలు అవసరం అంది. నన్ను అడిగింది. తన భర్త తాలూకు డబ్బు రాగానే ఇస్తానంది. రేపు ఉదయం కాలేజీ దగ్గర ఇస్తానని చెప్పాను. అప్పుడు గుర్తు రాలేదు. రేపు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ వుంది. తొమ్మిది గంటలకే వెళ్లాలి. ఆమె వాళ్లమ్మాయితో కలసి నాకోసం కాలేజీలో ఎదురు చూస్తుందేమో.. ఇప్పుడేం చెయ్యాలి? ఆమె ఏమనుకుంటుందో?’’ అన్నాడు దివాకరం విచారంగా.

‘‘వర్రీ అవకండి.. ఆ కాలేజీ పేరు చెబితే నేను వెళ్లి డబ్బు ఆమెకు ఇస్తాను’’ అన్నది రేణుక.

‘‘నువ్వా’’ ఆశ్చర్యంగా అన్నాడు దివాకరం.

‘‘అవును.. నేనే.. భార్య భర్త మనసును అర్థం చేసుకున్నంత మాత్రాన సరిపోదు. ఆ విషయాన్ని అతనికి తెలియజేయటానికి ఏదయినా బలమైన సంఘటన జరగాలి. ఇప్పుడు నాకు అలాంటి అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటాను.’’ అన్నది రేణుక.

‘‘థ్యాంక్స్ రేణూ’’ అన్నాడు దివాకరం కృతజ్ఞతగా.

‘‘ఆమె నాకంటే అందంగా వున్నదని సునయన చెప్పింది. చూడాలి’’ అన్నది రేణుక.

‘‘ఆడమనసా?’’ అనడిగాడు దివాకరం.

‘‘అవును..’’ అన్నది రేణుక పెద్దగా నవ్వుతూ.

– ప్రతాప రవిశంకర్

(నవ్య 2008 దీపావళి ప్రత్యేక సంచికలో బాలిగారి ‘అద్దం’ కథ చదివిన ఇన్‌స్పిరేషన్‌తో)